సాక్షి విశాఖపట్నం

శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఏయూ రిజిస్ట్రార్ మొన్నటివరకు నివసించిన బంగ్లా. ఇప్పుడు ప్రస్తుత వీసీ రాజశేఖర్ నివాసం ఉంటున్నారు. తాను నివాసం ఉండేందుకు వీలుగా వీసీ ఏకంగా రూ.64 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయించుకున్నారు. అయితే డాక్టర్ క్వార్టర్ మరమ్మతులకు రూ.లక్ష మంజూరు చేసేందుకు మాత్రం ససేమిరా అంటూ వీసీ మోకాలడ్డారు. ఏయూ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడానికి ఇదే కారణంగా తెలుస్తోంది. విద్యార్థి మరణం నేపథ్యంలో వీసీ వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వీసీ బంగ్లాకు రూ.64 లక్షలతో మరమ్మతులు

డాక్టర్ క్వార్టర్‌కు రూ.లక్ష లేదట

- డాక్టర్ అందుబాటులో లేకపోవడానికి ఇదే కారణం
- ఫైల్‌ను ఆరు సార్లు పంపినా పట్టించుకోని ఏయూ వీసీ
- విద్యార్థి మరణం నేపథ్యంలో వీసీ వైఖరిపై విమర్శల వెల్లువ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

తాను ఉండేందుకు రిజిస్ట్రార్ బంగ్లాను రూ.64 లక్షలతో మరమ్మతులు చేయించుకున్న ఏయూ వీసీ రాజశేఖర్.. ఏయూ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే డాక్టర్ నివాసం ఉండేందుకు లక్ష రూపాయలతో క్వార్టర్‌లో మరమ్మతులు చేయించాలని కోరినా పట్టించుకోకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. విద్యార్థి మరణంపై విద్యార్థులు ఇంత తీవ్రస్థాయిలో స్పందించేందుకూ వీసీ వైఖరే ప్రధాన కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి వీసీ తన బంగ్లాలో ఉందామనుకుని.. ఐఐటీ నుంచి ప్రత్యేక టీమ్‌తో మరమ్మతులు చేయించుకునేందుకు యత్నించినట్టు తెలుస్తోంది. అయితే ఈ బంగ్లా నివసించేందుకు అంతగా అవకాశం లేదని తేల్చిచెప్పడంతో రిజిస్ట్రార్ బంగ్లాలో నివాసం ఉండాలని వీసీ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అనుకున్న వెంటనే ఈ బంగ్లాలో మరమ్మతుల పేరిట భారీగా వెచ్చించేందుకు సమాయత్తం కావడంతో పాటు ఇప్పటికే రూ. 64 లక్షల మేర ఖర్చు చేసినట్టు సమాచారం. ఒకవైపు తన బంగ్లా కోసం లక్షలకు లక్షలు తగలేస్తున్న వీసీ... డాక్టర్ కోసం క్వార్టర్ మరమ్మతుకు రూ.లక్ష ఖర్చు ఎందుకు చేయలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏకంగా ఆరుసార్లు ఫైలును పంపినప్పటికీ తిప్పిపంపడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ఏయూలో చోటుచేసుకుంటున్న ప్రస్తుత వివాదాలను ఉద్దేశపూర్వకంగా సృష్టిస్తున్నవన్న మంత్రి లోకేష్ వ్యాఖ్యలను విద్యార్థులు తప్పుపడుతున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా విద్యార్థులపై నెపం నెట్టడాన్ని విద్యార్థులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

వీసీ వైఖరితోనే..!

శాతావాహన హాస్టల్‌లో ఉంటున్న బీఈడీ రెండో సంవత్సరం విద్యార్థి మణికంఠ గురువారం ఆకస్మికంగా మరణించారు. ఊపిరి తీసుకోలేక అస్వస్థతకు గురికాగా.. సరైన వైద్యం అందించకపోవడంతోనే తమ మిత్రుడు మరణించాడంటూ సహచర విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలు శుక్రవారం కూడా కొనసాగాయి. తమ ప్రాణాలకు విలువలేకుండా పోయిందని విద్యార్థులు మండిపడుతున్నారు. అంతేకాకుండా ఏయూ ఆరోగ్య కేంద్రంలో సరైన సౌకర్యాలు లేవని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ కనీసం ఆక్సిజన్ పెట్టేవారు కూడా లేరని వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే అక్కడ ఉండే డాక్టర్ 24 గంటలు అందుబాటులో ఉండేందుకు వీలుగా క్వార్టర్ కేటాయించాలని అధికారులు భావించారు. ఇందుకోసం ఒక క్వార్టర్‌లో రూ.లక్ష వెచ్చించి మరమ్మతులు జరిపితే అక్కడ నివసించేందుకు అనువుగా ఉంటుందని భావించి ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలుస్తోంది. అయితే, దీనిని కనీసం వీసీ పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఈ ఫైలును కనీసం 6 సార్లు వీసీ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే డాక్టరు అందుబాటులో లేకుండా పోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ డాక్టరు అందుబాటులో ఉంటే... విద్యార్థి మణికంఠ ఏయూ ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వెంటనే ఆక్సిజన్ అందించడంతో పాటు అంబులెన్స్‌లో జాగ్రత్తగా తరలించే వీలు కలిగేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా సొంత భవంతికి లక్షలకు లక్షలు ఖర్చు చేసి సొబగులు అద్దుకుంటున్న వీసీ.. డాక్టర్ కోసం క్వార్టర్ మరమ్మతుకు రూ.లక్ష ఎందుకు ఇవ్వలేదనే ప్రశ్నలు వెంటాడుతున్నాయి. మొత్తంగా వీసీ వ్యవహార శైలితో ఇప్పటికే ఏయూ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటుండగా.. ఇప్పుడు ఏకంగా విద్యార్థుల ప్రాణాలకు కూడా సమస్యగా మారిందనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

వరుసగా వివాదాలు..!

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏయూలో వ్యవహారాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఒక ప్రైవేటు విద్యా సంస్థకు మేలు చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏయూలో నియమితులైన అధికారులందరూ సదరు ప్రైవేటు సంస్థలో గతంలో పనిచేయడమూ ఇందుకు కారణం. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు అర్ధ రాత్రి సమయంలో రోడ్డు మీదకు వచ్చి నిరసనలు తెలుపుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అన్నం సరిగ్గా లేదని ఒకసారి... కనీస సౌకర్యాలు లేవని మరోసారి.. నియామకాల్లో అన్యాయం జరుగుతోందంటూ ఇంకోసారి ఇలా వరుస వివాదాల్లో కూరుకుపోతోంది. తాజాగా విద్యార్థి మరణించిన సంఘటనతో ఇన్నాళ్లుగా వ్యక్తమవుతున్న ఆందోళన కాస్తా.. ఆగ్రహంగా మారిపోయింది. ఏకంగా తమ ప్రాణాలనే బలితీసుకునేందుకూ వెనుకాడటం లేదన్న ఆవేశం విద్యార్థుల్లో కట్టలు తెంచుకుంది. వాస్తవానికి గతంలో కోవిడ్ సమయంలోనూ ఏయూలో మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించారు. ఏకంగా 600 మంది విద్యార్థులకు ప్రత్యేక గదులను కేటాయించడంతో పాటు క్వారంటైన్ ముగిసిన తర్వాత వారి తల్లిదండ్రులకు జాగ్రత్తగా అప్పటి వీసీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో అప్పగించారు. అదేవిధంగా కోవిడ్ సమయంలో ప్రయాణానికి అనుమతి లేని 500 మంది విదేశీ విద్యార్థులకు టీకాలు లభించని సమయంలో కూడా టీకాలు వేయించి మరీ వారి ప్రాణాలకు భరోసా కల్పించే ప్రయత్నం జరిగింది. ఇప్పుడు ఆరోగ్యం బాగోలేదని వచ్చిన విద్యార్థినికి సమయానికి ఆక్సిజన్ అందించి కాపాడుకోలేని దీనస్థితికి ఏయూను పాలకులు దిగజార్చారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అన్నంలో పురుగులు వచ్చాయని విద్యార్థుల ఆందోళన (ఫైల్)

అన్నయ్య కంటే బాబు ఎక్కువయ్యారా?



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, సమన్వయకర్త మొల్లి అప్పారావు, యువజన విభాగం నాయకులు ఉరుకూటి చందు, అంబటి శైలేష్, దొడ్డికిరణ్, నాగేంద్ర, పార్టీ నేతలు

- చిరంజీవిపై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు
- స్పందించడంలో పవన్ మౌనం ఎందుకు?
- ప్రశ్నించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు
- బాలయ్య వ్యాఖ్యలపై భగ్గుమన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

బీచ్‌రోడ్డు: అసెంబ్లీ సాక్షిగా చిరంజీవిపై టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించకపోవడం దారుణమని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు విమర్శించారు. సొంత అన్నయ్యను వాడు.. వీడు అంటూ బాలకృష్ణ చులకనగా మాట్లాడినా పవన్ కల్యాణ్ ఆ వ్యాఖ్యలను ఖండించకపోవడంలో మర్మమేంటని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, కేంద్ర మాజీమంత్రి చిరంజీవిపై అసెంబ్లీలో బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉరుకూటి చందు ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. జీవీఎంసీ ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి, బాలకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ.. 15 నెలల కూటమి పాలనలో ప్రజాప్రతినిధులు అధికార మదంతో వ్యవహరిస్తున్నారని, పాలనను గాలికొదిలేసి కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. 'ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో మానసిక స్థితి సరిగా లేని వ్యక్తితో అమర్యాదకరంగా మాట్లాడించి సభా ప్రతిష్టకు భంగం కలిగించారు. ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో వీధి రౌడీలా చొక్కా గుండీలు విప్పుకుని, నెత్తి మీద కళ్లజోడు పెట్టుకుని, రెండు చేతులు జేబుల్లో పెట్టుకుని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, చిరంజీవిని కించపరిచేలా మాట్లాడిన తీరును రాష్ట్ర ప్రజలంతా చూశారు.' అని అన్నారు. కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, మంత్రులు, డిప్యూటీ స్పీకర్ సైతం బాలకృష్ణ వ్యాఖ్యలను ప్రోత్సహించేలా ప్రవర్తించారే తప్ప ఒక్కరూ ఖండించలేదని మండిపడ్డారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించకపోవడం చూస్తుంటే.. ఆయనకు అన్నయ్య కంటే చంద్రబాబే ముఖ్యమైనట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు గౌరవప్రదంగా నడుచుకోవాలని, బాలకృష్ణ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, చిరంజీవికి తక్షణమే క్షమాపణలు చెప్పాలని కేకే రాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, ఉత్తరాంధ్ర యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి అంబటి శైలేష్, ముఖ్యనేతలు దొడ్డి కిరణ్, మహమ్మద్ ఇమ్రాన్, కనకాల ఈశ్వరరావు, ముప్పల సంతోష్, తాడి రవితేజ, రవి కుమార్ రెడ్డి, అనుబంధ విభాగాల అధ్యక్షులు ముత్తి సునీల్ కుమార్, జగదీశ్వర్ రెడ్డి, సనపల రవీంద్ర భరత్, ఎస్.ప్రసాదరావు, జీలకర్ర నాగేంద్ర, మార్కండేయులు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గ, వార్డు అధ్యక్షులు చిల్లింగి నాగేశ్వర్ రావు, ఉమ్మడి కల్యాణ్, రాష్ట్ర, జిల్లా, నాయకులు ప్రగడ జాన్, సంపంగి సురేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అందరూ దోషులే!

- అక్రమ మైనింగ్‌కు కొమ్ముకాస్తున్న అధికారులు
- కూటమి నేతల ధనదాహానికి ప్రజల ప్రాణాలు హరి
- భారీ రాళ్ల తరలింపుతో రోడ్లు ఛిద్రం
- పక్క జిల్లా నుంచి వస్తున్నా పట్టించుకునే వారేరీ
- మైనింగ్, పోలీసు, రవాణా అధికారులకు భారీగా ముడుపులు





➤ ఇది కాకినాడ జిల్లా రౌతులపూడికి చెందిన సన్నిధి మినరల్స్‌కు చెందిన టిప్పరు. రాంబిల్లి వద్ద కొండవారిపాలెం గ్రామం వద్ద ఈ టిప్పరు నుంచి రెండు భారీ బండరాళ్లు జారి పడ్డాయి. వెనుక ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అధిక లోడుతో ప్రమాదకర రాళ్లతో ఎటువంటి కనీస జాగ్రత్తలు తీసుకోకుండా అంత నిర్లక్ష్యంగా ఇష్టారాజ్యంగా వెళ్లడానికి వారికి ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది?



➤ ఈ ఏడాది మార్చి 16వ తేదీన మునగపాకకు చెందిన టీడీపీ కార్యకర్త, ఎల్ఐసీ ఏజెంట్ గన్నారావు మైనింగ్ టిప్పరు గుద్ది ప్రాణాలు కోల్పోయారు. కంటితుడుపుగా కేసు పెట్టడం మినహా రోజువారీగా అక్రమ మైనింగ్, అధిక లోడు వాహనాల విషయంలో తనిఖీలు మాత్రం జరగడం లేదు.



➤ అక్రమ మైనింగ్ కోసం అనుమతి లేకుండా మైనింగ్ మాఫియా వేసుకున్న రహదారి. ఎటువంటి అనుమతి లేకున్నా రోడ్డు నిర్మిస్తుంటే... పదే పదే గ్రామస్తులు ఫిర్యాదు చేస్తే తప్ప అటువైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు.



➤ ఈ ఏడాది మార్చి 25న అనకాపల్లి టౌన్‌లో విజయరామరాజు పేట వద్ద గల రైల్వే అండర్ బ్రిడ్జి గడ్డర్‌ను క్వారీ లారీ ఢీకొనడంతో భారీ ప్రమాదం తప్పింది. దీంతో రైల్వే గడ్డర్ పాక్షికంగా దెబ్బతింది.

ఇవే కాదు ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్‌కు అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ అటు మైనింగ్ అధికారులు కానీ... ఇటు రవాణాశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు గానీ చర్యలు తీసుకునేందుకు ప్రయత్నించడం లేదు. ప్రతి నెలా ఆయా విభాగాలకు తంచనుగా మామూళ్లు అందుతుండటమే కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తంగా కూటమి నేతల ధన దాహం, అధికారుల అలసత్వం వెరసి ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటోంది.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అనకాపల్లి జిల్లా మైనింగ్ అవకతవకలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. శుక్రవారంనాటి తాజా సంఘటననే ఇందుకు ఉదాహరణ. వాస్తవానికి రాంబిల్లి మండలంలోని కొండవారిపాలెం వద్ద రెండు బండరాళ్లను విడిచిన టిప్పర్లు పక్క జిల్లా కాకినాడ నుంచి వస్తున్నాయి. తుని, పాయకరావుపేట, నక్కపల్లి, యలమంచిలి నియోజకవర్గాలను దాటుకుని రాంబిల్లి వద్ద జరుగుతున్న నావికాదళ పనుల కోసం ఈ బండరాళ్లను తరలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని పోలీసు, రవాణా, మైనింగ్ అధికారులు తనిఖీలు జరిపితే ఇటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించే వీలుంటుంది. ప్రతి రోజూ పక్క జిల్లా నుంచి పదుల సంఖ్యలో అధిక లోడుతో టిప్పర్లు వస్తున్నప్పటికీ ఆయా స్టేషన్ల పరిధిలోని పోలీసు, రవాణా శాఖల సిబ్బంది పట్టించుకోవడం లేదు. ప్రతి నెలా భారీగా అందుతున్న మామూళ్లే ఇందుకు కారణమని వేరే చెప్పనక్కరలేదు.

అధిక లోడుతో చక్కర్లు...!

అనకాపల్లి జిల్లాలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌తో టిప్పర్లు అధికలోడుతో వెళుతున్నాయి. తద్వారా రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. ఇప్పటికే అనేకసార్లు ప్రమాదాలు కూడా జరిగాయి. కొంత మంది ప్రాణాలను కూడా బలితీసుకున్నాయి. అనకాపల్లి నియోజకవర్గంలో ఉన్న వివిధ క్వారీల ద్వారా రోజువారీ 1,000 ట్రిప్పుల బండరాళ్లను మునగపాక మీదుగా రోడ్లపై భారీ శబ్దాలు చేస్తూ రాంబిల్లిలోని నావికాదళ పనుల కోసం తరలిస్తున్నారు. 32-36 టన్నుల సామర్థ్యం కలిగిన టిప్పర్లల్లో ఏకంగా 50 టన్నుల మేరకు భారీ బండరాళ్లు వేసుకుని తిరుగుతున్నా అటు మైనింగ్ అధికారులు కానీ, ఇటు రవాణాశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు కానీ కనీసం కన్నెత్తి చూడటం లేదు.

అక్రమ సంపాదన నెలకు రూ.2 కోట్లు

ఒక్కో ట్రిప్పునకు నెలకు రూ.22 వేల చొప్పున కూటమి నేతలు ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో నెలవారీ వసూలవుతున్న మొత్తం రూ.2 కోట్లకు పైమాటే. కూటమి నేతలతోపాటు మైనింగ్, రవాణా, పోలీసు, రెవెన్యూ అధికారులకూ భారీగా వాటాలు అందుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రవాణాశాఖ అధికారులు అధిక లోడుతో వెళుతున్న వాహనాలను చూసీ చూడనట్టుగా వదిలేస్తున్నారు. అనధికారిక క్వారీల్లో జరుగుతున్న మైనింగ్‌ను పట్టించుకోకుండా ఉండేందుకుగానూ మైనింగ్ అధికారులకూ భారీగా ముడుతోందన్న విమర్శలున్నాయి. అక్రమ మైనింగ్‌తో పాటు అధిక లోడుతో భారీగా రాయల్టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. ఇక మైనింగ్ విజిలెన్స్ అధికారులు కనీసం ఒక్కటంటే ఒక్కసారి కూడా దాడులు చేసి అక్రమ మైనింగ్‌ను నిలిపివేసేందుకు గత 6 నెలల కాలంలో ప్రయత్నించలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు స్థానిక పోలీసు, రెవెన్యూ, విజిలెన్స్ ఇలా అన్ని విభాగాల అధికారులకు వాటాల లెక్కన పంచుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారాలన్నీ కూటమి నేత బంధువు దగ్గరుండీ మరీ చూస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరి వాటా వారికి ఇచ్చిన తర్వాత మిగిలిన మొత్తం భారీ స్థాయిలో సదరు కూటమి నేత బంధువు జేబులోకి వెళుతోంది.

నేరుగా వాయిస్ మెసేజ్‌లు ఉన్నా...

''ఈ నెల 10వ తేదీలోగా నా వద్దకు వచ్చి... కన్ఫర్మ్ చేసుకోండి. 10వ తేదీన జాబితా సిద్ధమవుతుంది. 11వ తేదీ నుంచి ఎవరైనా పట్టుకుంటే నాకు సంబంధం లేదు. ఫోన్ పేలు ఎవ్వరూ చేయవద్దు'' ఇది అనకాపల్లి జిల్లాలో అధిక లోడుతో వెళుతున్న, అనుమతి లేని వాహనాల విషయంలో వసూళ్లకు సంబంధించిన ఆడియో మెసేజ్. ఈ ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. అసలు ఏ శాఖకు సంబంధం లేని ఒక ప్రైవేటు వ్యక్తి ధైర్యంగా ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలకు ఆడియో మెసేజ్‌లు పంపి వసూళ్లకు తెగబడుతున్నాడంటే... సదరు వ్యక్తికి ఎంతమేర అధికారుల నుంచి అండదండలున్నాయో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి ప్రతి నెలా లారీకి ఇంత చొప్పున అటు మైనింగ్, ఇటు పై యాష్... అంతేకాకుండా సెజ్‌లకు వెళ్లే బస్సుల యాజమాన్యాలు రవాణాశాఖ అధికారులకు పైకం చెల్లించాలి. లేని పక్షంలో దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. ఈ వ్యవహారమంతా ఒక ప్రైవేటు వ్యక్తి ద్వారా రవాణాశాఖ అధికారులు నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి.

4న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం అక్టోబర్ 4న చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

విశాఖకు వాయు'గండం'

- నేడు వైజాగ్–శ్రీకాకుళం మధ్య తీరం దాటే అవకాశం
- భారీ వర్షాలు పడే సూచనలు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ మీదుగా వాయుగండం ముంచుకొస్తోంది. వాయువ్య బంగాళాఖాతం, దానికి అనుకుని ఉన్న మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. స్థిరంగా కొనసాగుతోంది. ఇది శుక్రవారం అర్ధరాత్రి మరింత బలపడి విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల మధ్యగా ప్రయాణించి.. వాయుగుండంగా మారనుంది. శనివారం ఉదయం విశాఖపట్నం, శ్రీకాకుళం మధ్య తీరం దాటే అవకాశం ఉందని తుఫాన్ హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో జిల్లాలో శనివారం సాయంత్రం వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలున్నాయన్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందనీ.. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కి.మీ గరిష్ఠంగా 60 కి.మీ వేగంతో బలమైన గాలులు వీస్తాయన్నారు. శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది.

నాటి మెరుపులే తప్ప..
కొత్త వెలుగులేవీ..?



- విశాఖలో పడకేసిన పర్యాటకాభివృద్ధి
- ఏడాదిన్నర పాలనలో ఒక్క ప్రాజెక్టూ తీసుకురాని కూటమి సర్కారు
- కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జికి వైఎస్సార్‌సీపీ హయాంలోనే అంకురార్పణ
- కూటమి వచ్చిన తర్వాత ప్రైవేట్ చేతుల్లో పర్యాటక భవనాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

సాక్షి, విశాఖపట్నం: 'పర్యాటక రాజధానిగా' విశాఖను మారుస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా టూరిజం రంగాన్ని గాలికొదిలేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులు పూర్తయి పర్యాటకులకు కొత్త అనుభూతిని పంచుతున్నాయే తప్ప, కూటమి వచ్చాక ఒక్క కొత్త టూరిజం ప్రాజెక్టు అయినా పట్టాలెక్కకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కొత్త మెరుపులు లేకుండానే మరో పర్యాటక దినోత్సవం ముగిసిపోతోందని పర్యాటక ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీఐఎస్–2023 సదస్సులో రూ. 8,806 కోట్ల విలువైన 66 టూరిజం ప్రాజెక్టులకు సంబంధించిన ఎంవోయూలను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. సింగపూర్, టర్కీ, ఫ్రాన్స్ వంటి దేశాలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించిన ఈ ప్రాజెక్టులు పడకేయడంతో విశాఖకు ప్రపంచ పర్యాటక పటంలో లభించాల్సిన స్థానం చేజారిపోయే ప్రమాదం ఉంది. మరోవైపు కూటమి నాయకులు ఉన్న భూములను కొల్లగొట్టేందుకు పీపీపీ పేరుతో స్కెచ్‌లు వేస్తున్నారే తప్ప, కొత్తగా అభివృద్ధి చేయడం లేదన్న విమర్శలున్నాయి.

2024 ఏప్రిల్‌లోనే గ్లాస్ బ్రిడ్జికి ఎల్‌వోఏ

కైలాసగిరిపై నిర్మాణం పూర్తయిన గ్లాస్ బ్రిడ్జ్ ప్రాజెక్టు తమ ఘనతేనని కూటమి నేతలు ప్రచారం చేస్తుండగా, వాస్తవానికి ఈ ప్రతిపాదన 2022లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే వచ్చింది. 2024 జనవరిలో పీపీపీ పద్ధతిలో ఈ ప్రాజెక్టుకు ఎల్‌వోఏ ఇచ్చారని. ఇప్పుడు పనులు పూర్తవడంతో ఆ క్రెడిట్ కూటమి తన ఖాతాలో వేసుకుంటోంది.

రూ. వేల కోట్ల భూములపై నేతల కన్ను

మరోవైపు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే ఆలోచనలు చేయకుండా, ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని రూ. వేల కోట్ల విలువైన పర్యాటక భూములను తమ అనుచరులకు కట్టబెట్టేందుకు కూటమి నాయకులు వ్యూహరచన చేస్తున్నారు. యాత్రినివాస్ వంటి భవనాలను ఇప్పటికే పీపీపీ పేరుతో ప్రైవేట్‌కు అప్పగించింది. తమ నియోజకవర్గాల పరిధిలోని విలువైన పర్యాటక భూములను అనుచరులకు కట్టబెట్టడానికి కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారు. విశాఖ జిల్లాలో 176.15 ఎకరాలు, అనకాపల్లి జిల్లాలో 22.67 ఎకరాలు, అల్లూరి జిల్లాలో 43.10 ఎకరాలు చొప్పున మొత్తం 241.92 ఎకరాల్ని కొల్లగొట్టేందుకు స్కెచ్ వేశారు. త్వరలోనే కూటమి నేతల అనుచరులకు టూరిజం ప్రాజెక్టుల పేరుతో భూపందేరం జరగనుంది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచే మార్గా లను అన్వేషించకుండా.. ఉన్న భూములను కూటమి నాయకులకు ధారాదత్తం చేసేందుకు.. ప్రభుత్వ పెద్దలు ఎవరికి చెబితే.. వారికి భూ కేటాయింపులు చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని సమాచారం. గత ప్రభుత్వ హయాంలో కుదిరిన రూ. వేల కోట్ల ఒప్పందాలను పక్కన పెట్టి, భూములను కూటమి నేతల అనుచరులకు ధారాదత్తం చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని సమాచారం.

అవకాశాలున్నా.. ఆలోచన సున్నా.!

మాటల్లోనే విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారే తప్ప.. వాస్తవ రూపం దాల్చేలా ఒక్క అడుగు కూడా కూటమి ప్రభుత్వం వెయ్యడం లేదు. గత ప్రభుత్వం హయాంలో ఒప్పందం ప్రకారం అన్నవరంలో ఒబెరాయ్, మై ఫెయిర్ హోటల్స్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ తరహా ఒప్పందం ఒక్కటి కూడా కూటమి ప్రభుత్వం చెయ్యలేదు. విశాఖ నగరంలో పర్యాటక వనరులు కోకొల్లలుగా ఉన్నాయి. వాటిని పట్టించుకోకుండా.. పీపీపీ పద్ధతిలో భూములు కట్టబెట్టేందుకు ప్రభుత్వం యత్నిస్తుందే తప్ప.. కొత్త ఆలోచనల్ని అమలు చెయ్యడంలో పూర్తిగా విఫలమయ్యింది.

నేడు పర్యాటక సంబరాలు

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా.. జిల్లాలో ప్రత్యేక సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి జె.మాధవి తెలిపారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో విశాఖపట్నం హోటల్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. మర్చెంట్ హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

త్వరలో మరో హిప్‌హాప్ బస్సు



ఉమ్మడి విశాఖలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇప్పటికే బీచ్‌రోడ్డులో రూ.5 కోట్లతో రెండు హిప్‌హాప్ బస్సులు నడుపుతున్నాం. త్వరలోనే మరో హిప్‌హాప్ బస్సు పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నాం. రుషికొండ, జోడుగుళ్ల పాలెం, భీమిలి బ్యాక్ వాటర్‌లో వాటర్‌స్పోర్ట్స్, కయాకింగ్, స్కూబాడైవింగ్ మొదలైనవి అందుబాటులోకి రాబోతున్నాయి. విశాఖ, అరకు క్యారవాన్స్ తీసుకొస్తున్నాం. టూరిజం హోటల్స్‌కు టెండర్లు వేశాం. త్వరలోనే వైజాగ్‌లో 2 వేల రూమ్స్ అందుబాటులోకి వస్తున్నాయి. స్పోర్ట్స్ టూరిజం, ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

– జీవీబీ జగదీష్, ఏపీటీడీసీ డీవీఎం

ప్రపంచ స్థాయి హోటల్స్‌తో పర్యాటకుల తాకిడి



ఈ ఏడాది టూరిజం డేని పర్యాటకంలో స్థిరమైన, సమగ్రాభివృద్ధి అనే థీమ్‌తో నిర్వహిస్తున్నాం. పర్యాటక రంగంలో హాస్పిటాలిటీ ప్రధాన పాత్రపోషిస్తోంది. ప్రపంచ స్థాయి హోటల్స్ రాబోతుండటంతో.. విశాఖకు సందర్శకుల తాకిడి రెట్టింపయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. విశాఖకు వచ్చే పర్యాటకుల సంఖ్య ప్రస్తుతం కోటికి పైగా ఉంది. ఇది రెట్టింపు చేసుకునే అవకాశాలు బోలెడు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. భవిష్యత్తులో విశాఖకు విమానాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అంతర్జాతీయ విమానాల సంఖ్య పెరిగితే మెడికల్ టూరిజం, స్పిరిచ్యువల్ టూరిజం అభివృద్ధి చెందనున్నాయి.

– పవన్ కార్తీక్, ఏపీ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్

ఆటో డ్రైవర్ దారుణ హత్య

- మద్యం మత్తులో ఘటన
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు



గణేష్ మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో జరిగిన ఈ దారుణం స్థానికంగా భయాందోళనకు గురిచేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. తిక్కవానిపాలెంలో కుటుంబసభ్యులతో కలిసి గణేష్(29) నివాసముంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగించే అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య కైలాసపురంలోని ఆమె పుట్టింట్లో ఉన్నారు. గురువారం మధ్యాహ్నం ఆటో బేరం ఉందని చెప్పి గణేష్ ఇంటి నుంచి వెళ్లాడు. అర్ధరాత్రి సుమారు ఒంటి గంట సమయంలో కంచరపాలెం, తిక్కవానిపాలెం సమీపంలోని పైడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద అదే ప్రాంతానికి చెందిన రాజుతో కలిసి ఆటోలో కూర్చుని మద్యం సేవించాడు. కాసేపటి తర్వాత రాజుకి, గణేష్‌కి మధ్య ఘర్షణ జరిగింది. పక్కనే ఉన్న మరో ఇద్దరు యువకులు ఆపడానికి ప్రయత్నించినా వారి మధ్య వాగ్వాదం ఆగలేదు. ఇంతలో అశోక్ అనే యువకుడు రాజును ఇంటికి తీసుకుని వెళ్లాడు. అప్పుడే ఇంటికి వచ్చిన రాజు సోదరుడు తరుణ్.. విషయం ఏంటని రాజును ప్రశ్నించాడు. అక్కడ జరిగిన గొడవ గురించి రాజు తెలిపారు. వెంటనే రాజు, తరుణ్, అశోక్ మళ్లీ గణేష్ దగ్గరకు వచ్చి గొడవ పడ్డారు. దీంతో వారి మధ్య మాటా మాటా పెరిగి, దుర్భాషలాడుకున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న కర్రతో గణేష్ తలపైనా, చెవిపైనా తరుణ్ బలంగా కొట్టాడు. తల వెనుక భాగంలో బలంగా తగలడంతో గణేష్‌కు తీవ్ర గాయమై, రక్తపు మడుగుల్లో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న గణేష్ తండ్రి అప్పారావు అక్కడకు చేరుకుని 100కి, అలాగే 108కి కూడా ఫోన్ చేశారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని గణేష్ అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. హత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. గణేష్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి తరుణ్, రాజు, అశోక్ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. కాగా.. నిందితుడు తరుణ్‌పై రౌడీషీట్ కూడా ఉందని తెలుస్తోంది.

కన్న తండ్రిని రోడ్డుపై వదిలేసి..

- ఆదుకున్న టూటౌన్ పోలీసులు
- నైట్ షెల్టర్‌లో ఆశ్రయం



రైల్వే స్టేషన్ వద్ద వృద్ధుడ్ని రక్షక్‌లో తరలిస్తున్న టూటౌన్ పోలీసులు

అల్లిపురం: రోజురోజుకీ మానవత్వ విలువలు పడిపోతున్నాయనడానికి ఈ సంఘటనే నిదర్శనం. కన్న తల్లిదండ్రులను వారి అంతిమ దశలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన పిల్లలు వారిని బరువుగా భావిస్తున్న దుస్థితి కనిపిస్తోంది. ఆస్తులు కావాలి గానీ, కన్నవారు అవసరం లేదా అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం సాయంత్రం విజయనగరం నుంచి సుమారు 75 ఏళ్ల వృద్ధుడిని రైల్వే స్టేషన్ దరి సిగ్నల్ పాయింట్‌కు సమీపంలో ఒక ఆటోలో తీసుకువచ్చి వదిలివెళ్లారు. ఆయనకు యూరినల్ బ్యాగు తగిలించి ఉండగా, డైపర్ వేసి ఉంది. వృద్ధుడి పరిస్థితిని చూసిన సమీపంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్, వెంటనే టూటౌన్ బ్లూకోల్ట్ కానిస్టేబుల్ నారాయణకు సమాచారం అందించారు. నారాయణ అక్కడికి వెళ్లి, ఆ వృద్ధుడి దుస్థితి చూసి చలించిపోయారు. అనంతరం రక్షక్‌కు ఫోన్ చేసి, విషయాన్ని టూటౌన్ సీఐ వీసీఎం ఎర్రంనాయుడుకు తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు వృద్ధుడిని భీమ్‌నగర్ నిరాశ్రయ వసతి గృహానికి తరలించి, ఆశ్రయం కల్పించారు. వృద్ధుడు తనది విజయనగరం అని మాత్రమే చెప్పగలుగుతున్నారని, ఇతర వివరాలు చెప్పలేకపోతున్నారని పోలీసులు తెలిపారు. వృద్ధుడి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని, వారికి కౌన్సెలింగ్ చేసి, మరొకరు ఇలాంటి పనులు చేయకుండా తగిన విధంగా బుద్ధి చెప్పాలని పలువురు కోరుతున్నారు.

సన్యాసిపాత్రుడికి కేకే రాజు పరామర్శ



చికిత్స పొందుతున్న సన్యాసి పాత్రుడిని పరామర్శిస్తున్న కేకే రాజు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, విశాఖ ఉత్తర, తూర్పు నియోజకవర్గాల పరిశీలకుడు చింతకాయల సన్యాసి పాత్రుడు అనారోగ్య కారణంతో మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.దీంతో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేకే రాజు వెంట ఉత్తరాంధ్ర జోనల్ ప్రెసిడెంట్స్ అంబటి శైలేష్, ముత్తి సునీల్ కుమార్, జిల్లా ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షులు గాలి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

'నవోదయ' దరఖాస్తు గడువు పెంపు

కొమ్మాది: నవోదయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువును పొడిగించినట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. 2026–27లో కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ప్రవేశానికి అక్టోబర్ 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

అఖిల భారత న్యాయవాదుల సంఘం



జిల్లా కోర్టు ఆవరణలో ప్లకార్డులతో న్యాయవాదుల నిరసన

విశాఖ లీగల్: ఎన్నికల ముందు న్యాయవాదులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అఖిల భారత న్యాయవాదుల సంఘం కార్యదర్శి, సీనియర్ న్యాయవాది నూకల వెంకటేశ్వరరావు శుక్రవారం డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలు నెరవేర్చాలంటూ సంఘం రాష్ట్రవ్యాప్తంగా సంతకాల ఉద్యమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 60 వేల మంది న్యాయవాదులు ఉన్నారని, వారిలో అధిక శాతం మంది గ్రామీణ నేపథ్యం కలిగిన వారేనన్నారు. కనీస వసతులు లేక వృత్తిలో నిలదొక్కుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యువ న్యాయవాదులకు రూ.5వేలు చొప్పున నెలసరి భృతి అందజేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ మొత్తం కూడా సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. అలాగే నెలసరి భృతి రూ.10 వేలకు పెంచుతామన్న హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. వివిధ కారణాలతో న్యాయవాదులు మరణిస్తే ఇచ్చే రూ.4 లక్షల మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తామన్న ప్రభుత్వ హామీ కూడా అమలు కాలేదన్నారు. ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు.

పవన్ కల్యాణ్ హామీలకు కార్యరూపం ఎప్పుడు?

వారాహి యాత్ర సమయంలో పవన్ కల్యాణ్ ఇచ్చిన అనేక హామీలు కూడా నేటికీ కార్యరూపం దాల్చలేదని న్యాయవాదులు గుర్తు చేశారు. న్యాయవాదులకు ఆరోగ్యశ్రీ పథకం కూడా అమలు కావడం లేదన్నారు. న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాలు, కోర్టుల నవీకరణ, ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన గ్రంథాలయాలు తక్షణం అవసరమన్నారు. కార్యక్రమంలో ఏఐఎల్‌ఏ జాతీయ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది బి.వి. రామాంజనేయులు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

విశాఖ సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

విశాఖ సిటీ : విశాఖ సమగ్రాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ, ఐజీబీసీ సంయుక్త సహకారంతో 'పట్టణ ప్రణాళిక–భవిష్యత్తు నగరాలు' అంశంపై శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ విశాఖలో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతిపాదిత విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు 2028–29 నాటికి అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే నగర రోడ్ల విస్తరణకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. రహదారి భద్రత, వేగవంతమైన ప్రయాణానికి ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి రూ.200 కోట్ల అంచనా విలువతో ప్రతిపాదనలను ఏడీఎంకు సమర్పించామన్నారు. వీఎంఆర్‌డీఏ ద్వారా తీర ప్రాంత కోతను నివారించేందుకు ప్రత్యేక ప్రాజెక్టు సిద్ధమవుతున్నట్లు వివరించారు. మధురవాడ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.550 కోట్ల భూగర్భ సొరంగం ప్రాజెక్టు ప్రతిపాదన దశలో ఉందన్నారు. నగరం నుంచి సముద్రంలోకి విడుదలవుతున్న 41 కాలువలను మురుగునీటి శుద్ధి కర్మాగారాలకు అనుసంధానిస్తామన్నారు. వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్ మాట్లాడుతూ విశాఖ అభివృద్ధికి కేవలం 10 శాతం భూమి మాత్రమే అందుబాటులో ఉందన్నారు. ఈ ఛాలెంజ్‌లను సమర్థంగా ఎదుర్కొనడానికి వీఎంఆర్‌డీఏ థీమ్ ఆధారిత నగరాల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని వివరించారు. ఎస్‌బీఐ డీజీఎం రాహుల్ సాంకృత్య మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ కార్యక్రమానికి అనుగుణంగా ఎస్‌బీఐ గ్రీన్‌ఫైనాన్సింగ్, సోలార్‌ప్లాంట్లు, సూర్యశక్తి వంటి పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. సీఐఐ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కె.కుమార్‌రాజా మాట్లాడుతూ సంస్కృతి, వారసత్వ, వాతావరణానికి అనుగుణంగా పట్టణీకరణకు ప్రణాళికలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీఐఐ ఏపీ మాజీ చైర్మన్ జి.ఎస్.శివకుమార్, సీఐఐ విశాఖ హెడ్ మౌళి, సీఐఐ ఐజీబీసీ వైస్ చైర్మన్ పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకై.. వైద్యుల సమ్మె బాట

- ప్రభుత్వంపై పీహెచ్‌సీ వైద్యుల నిరసన గళం
- నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు



నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన పీహెచ్‌సీ వైద్యులు

మహారాణిపేట: తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన బాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి దశలవారీగా సమ్మెను ప్రారంభించారు. భీమిలి, రేవిడి, ఆనందపురం, మధురవాడ, కణితి, గాజువాక, పెదగంట్యాడ వంటి పలు ప్రాంతాల్లోని 10 పీహెచ్‌సీలకు చెందిన 20 మంది వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసన తెలిపారు. ఆందోళనలో భాగంగా వైద్యులు అన్ని అధికారిక పనులను, ముఖ్యంగా రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడాన్ని నిలిపివేశారు. ఈ సమాచారాన్ని ప్రతి రోజూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పంపాల్సి ఉండగా, శుక్రవారం నుంచి ఆ ప్రక్రియను నిలిపివేసినట్లు ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకుడు డాక్టర్ జగదీష్ తెలిపారు.

దశలవారీ ఆందోళన ప్రణాళిక : వైద్యులు తమ నిరసనను అక్టోబర్ 3 వరకు కొనసాగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 27న పీహెచ్‌సీల్లో అన్ని రకాల విధులను బహిష్కరిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద సర్వేలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిలిపివేస్తారు. సంచార చికిత్స, ఇతర వైద్య శిబిరాలకు దూరంగా ఉంటారు. 28న అన్ని అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలగుతారు. 29న ఓపీ సేవలను బహిష్కరిస్తారు. ప్రసవాలు, పాముకాటు, పాయిజనింగ్ వంటి అత్యవసర సేవలను మాత్రమే అందిస్తారు. 30న జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపడతారు. అక్టోబర్ 1 డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేస్తారు. 2న చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొంటారు. 3న విజయవాడలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని డాక్టర్ జగదీష్ తెలిపారు.

వైద్యుల డిమాండ్లు ఇవీ.. : 'ఇన్–సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలి. వైద్యులకు సకాలంలో పదోన్నతులు కల్పించాలి. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు బేసిక్ పేపై 50 శాతం ట్రైబల్ అలవెన్స్ ఇవ్వాలి. నేషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి. చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమంలో పనిచేస్తున్న వారికి రూ.5 వేల అలవెన్స్ ఇవ్వాలి.' అని వైద్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావుకు వినతిపత్రం అందజేసినట్లు డాక్టర్ జగదీష్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి ఆరేళ్ల జైలు

పెదగంట్యాడ: వ్యక్తిగత కక్షలతో ఒక వ్యక్తిని గాయపరిచిన నిందితుడికి ఆరేళ్ల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ గాజువాకలోని 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.కవిత శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి ఆ తీర్పులో పేర్కొన్నారు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాలివి. నిందితుడు ములకలపల్లి వెంకట నూకరాజు (45) పెదగంట్యాడ మండలం దుర్గవానిపాలెంలో నివాసం ఉంటున్నాడు. నిందితుడికి బాధితుడు గంట్యాడ శివ శంకర్ అలియాస్ శివ తండ్రితో పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నూకరాజు తరచూ శివ ఇంటికి వెళ్లి గొడవపడేవాడు. మీ అంతు చూస్తానని బెదిరించేవాడు. 2021 ఏప్రిల్ 16వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో శివ తన ఇంట్లో మిత్రులతో కూర్చుని మాట్లాడుతూ ఉండగా నూకరాజు బెదిరించి, గొడవపడ్డాడు. బాధితుడిని గాయపరిచాడు. మళ్లీ బాధితుడు ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఉండగా నూకరాజు పదునైన చాకుతో వచ్చి ఘర్షణకు దిగాడు. కుటుంబాన్ని అంత చూస్తానంటూ బెదిరించాడు. అంతటితో ఆగకుండా చాకుతో బాధితుడి నుదుటిపై పొడిచి గాయం చేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో పక్కనే ఉన్న మిత్రులు బాధితుడిని నగరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. న్యూ పోర్టు పోలీసులు నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 307, 324 కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ విధంగా తీర్పునిచ్చారు.

నేడు వీఎంఆర్‌డీఏ పార్కుల్లో ఉచిత ప్రవేశం

విశాఖ సిటీ : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉన్న పర్యాటక ప్రదేశాలకు శనివారం ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు సంస్థ చైర్‌పర్సన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంఆర్‌డీఏ పార్క్, కైలాసగిరి, సెంట్రల్ పార్క్, తెలుగు మ్యూజియం, సబ్‌మెరైన్, టీయూ–142 ఎయిర్‌క్రాఫ్ట్, సీ–హారియర్, యూహెచ్ 3హెచ్ హెలికాప్టర్ మ్యూజియాలను ఉచితంగా సందర్శించవచ్చన్నారు. విశాఖవాసులు, పర్యాటకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'ఏసీసీఏ'తో ఐఐఎంవీ ఒప్పందం

తగరపువలస: విద్యార్థులలో ఆర్థిక విద్య, వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఐఐఎంవీ, చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ అసోసియేషన్ (ఏసీసీఏ)తో శుక్రవారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఆనందపురం మండలం గంభీరంలో ఐఐఎంవీ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ సమక్షంలో ఈ ఎంవోయూ జరిగింది. అకౌంటెన్సీ, ఫైనాన్స్‌లో విద్యావకాశాలు పెంపొందించడానికి, ప్రొఫెషనల్ ఎక్సలెన్స్‌ను ప్రోత్సహించడానికి ఈ అవగాహన ఒప్పందంపై ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఏసీసీఏ భారత విద్యా భాగస్వామి సంబంధాల అధిపతి ప్రభాన్షు మిట్టల్, ఐఐఎంవీ విద్యాసంబంధాల డీన్ సూరిశెట్టి విజయభాస్కర్ పాల్గొన్నారు. అకౌంటింగ్ ప్రొఫెసర్ పూజా కుమారి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ కలెక్షన్లు అద్భుతం

సినీనటి రితికా నాయక్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీనటి రితికా నాయక్

దాబాగార్డెన్స్: మిరాయి ఫేమ్ రితికా నాయక్ నగరంలో సందడి చేశారు. జడ్జి కోర్టు ఎదురుగా సరికొత్త హంగులు, నూతన కలెక్షన్లతో వినూత్నంగా తీర్చిదిద్దిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీఎంఆర్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మావూరి వెంకటరమణ, డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ, జనరల్ మేనేజర్ నూలు లింగమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా రితికా నాయక్ మాట్లాడుతూ సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో, అద్భుతమైన కలెక్షన్లు ఉన్నాయన్నారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ.. '1984లో చందన బ్రదర్స్ పేరిట మొట్టమొదట ప్రారంభించిన షోరూం ఇదే. 40 ఏళ్లుగా వినియోగదారుల ఆదరాభిమానాలతో నేడు 4 రాష్ట్రాల్లో 42 శాఖలతో విజయవంతంగా కొనసాగుతున్నాం. వినియోగదారులకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ మాల్‌ను నూతన హంగులతో పునఃప్రారంభించాం.' అని తెలిపారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, పెద్ద సంఖ్యలో వినియోగదారులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

కంచరపాలెం: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఐబీపీఎస్, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ పోటీ పరీక్షల కోసం ఉచిత వసతి సౌకర్యంతో 60 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు విశాఖ–అనకాపల్లి జిల్లాల కో–ఆర్డినేటర్ జి.గ్రేస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ పాసై ఉండాలని, రిజర్వేషన్ల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. మ్యాథమెటికల్ ఎబిలిటీస్, రీజనింగ్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్, డిస్క్రిప్టివ్, జనరల్ అవేర్నెస్, కంప్యూటరీ ప్రొఫిషియెన్సీ, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ సబ్జెక్టుల్లో కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు https://apstdc.apcfss.in అక్టోబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అక్టోబర్ 22 నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440280275/ 7658945570 నంబర్లలో లేదా కంచరపాలెంలోని కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని సూచించారు.